సాక్షి
ఆదిలాబాద్

గురువారం । 16 । మే । 2024



పేషెంట్‌కేర్ ఆత్మహత్యాయత్నం

రిమ్స్‌లో పేషెంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి అనే కార్మికురాలు గైనిక్‌వార్డులో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 8లో▸



'కడెం' మరమ్మతులు పూర్తయ్యేనా?

కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. వానాకాలం సమీపిస్తున్నా పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న రాజర్షి షా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా బుధవారం పరిశీలించారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన మూడు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంలను సందర్శించారు. భద్రత చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

నూతన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన

బోథ్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ బుధవారం పరిశీలించారు. త్వరలోనే పాత కార్యాలయం నుంచి నూతన కార్యాలయంలోకి మార్చుతామన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆయన వెంట సబ్ రిజిస్ట్రార్ సాయినాథ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డుకులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివి, పదో తరగతి లో 7 జీపీఏకు పైగా సాధించిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ దివ్యాంగ విద్యార్థులు అ ర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కల వి ద్యార్థులు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమూనా పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆదిలాబాద్‌రూరల్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 10 నమూనా పరీక్షల కోసం అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజాలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు https://tsbcs tudycircle. cgg. gov. in/ First Page. do లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'కంది'పై పోలీసులకు ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ మాజీ నాయకురాలు గండ్రత్ సుజాతపై కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం నాయకులు పేర్కొన్నారు. కంది వ్యాఖ్యలను తప్పుబడుతూ బుధవారం వన్‌టౌన్ సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. సుజాతపై చేసిన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్, కలాల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

కైలాస్‌నగర్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో గల శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి వారికి అభిషేకం, నిత్యహారతి వంటి పూజలు నిర్వహించారు. వేద పారాయణం అనంతరం హోమం చేపట్టారు. ఉత్సవాలు ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి.

ఆధిక్యత ఎటువైపు..

- అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిస్థితిపై పార్టీల అంచనాలు
- పోలింగ్ సరళిపై బూత్‌ల వారీగా ఆరా
- అంచనాల్లో నేతలు బిజీ



ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ప్రస్తుతం, గతంలో నమోదైన పోలింగ్ శాతం వివరాలు

నియోజకవర్గం	2024	2019
సిర్పూర్	71.56	69.55
ఆసిఫాబాద్	75.49	73.96
ఖానాపూర్	72.20	71.20
ఆదిలాబాద్	73.89	70.31
బోథ్	78.16	76.09
నిర్మల్	71.68	66.76
ముథోల్	75.63	72.99

సాక్షి,ఆదిలాబాద్: గత పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ.. ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆధిక్యత సాధించింది. రెండో స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్.. సిర్పూర్, ఆసిఫాబాద్‌లో, మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ కేవలం ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆధిక్యత ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం బూత్‌ల వారీగా ఎలా ఉంది అనే దానిపై నేతలు అంచనాలు వేస్తున్నారు. ఏజెంట్లు, కార్యకర్తలను పిలిపించి సమీక్షిస్తున్నారు.

మార్పు తర్వాత పరిస్థితులు కలిసొచ్చేనా..

నియోజకవర్గాల్లో ముఖ్యనేతల పార్టీ మార్పు తర్వాత ప్రస్తుత పరిస్థితిలో ఆ ఆధిక్యత లభిస్తుందా.. లేదా అనేది ఆసక్తికరంగా మారింది. బీజేపీకి ఆధిక్యత వచ్చిన నియోజకవర్గాల పరంగాగమనిస్తే.. పలుచోట్ల రాజకీయ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. ప్రధానంగా నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ ప్రభావం ఎలా ఉంటుంది.. అలాగే ఇదే నియోజకవర్గంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ శోభా సత్యనారాయణ గౌడ్ దంపతులు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరడంతో ఎలా ఉంటుందనేది కూడా చూడాల్సిందే. ఇక ముథోల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ ఓట్లు ఎలా పడ్డాయనేది కూడా గమనించాల్సిందే. ఇక బీఆర్‌ఎస్‌కు గత ఎన్నికల్లో ఆధిక్యం ఇచ్చిన సిర్పూర్‌లో మళ్లీ ఆ పరిస్థితి ఉంటుందా లేదా అనేది కూడా పరిశీలించాల్సిందే. అక్కడ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు మారారు. గులాబీ పార్టీకి గత ఎన్నికల్లో ఆధిక్యం ఇచ్చిన మరో నియోజకవర్గం ఆసిఫాబాద్‌లో పరిస్థితుల్లో పెద్దగా మార్పులేకపోవడం, మరోపక్క ఆపార్టీ అభ్యర్థి అదే నియోజకవర్గానికి చెందిన వారు కావడం, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇక్కడ గెలుపొందడం అన్ని అంశాలు కలిసొచ్చేలా ఉన్నా ఆధిక్యాన్ని నిలుపుకుంటుందా లేదా అనేది చూడాల్సిందే. ఇక కాంగ్రెస్‌కు వస్తే గత పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక్క నియోజకవర్గం ఖానాపూర్‌లో ఆధిక్యత చూపించింది. అయితే అప్పుడు పార్టీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ అదే నియోజకవర్గం కావడం గమనార్హం. ప్రస్తుతం ఆయన బీజేపీలో ఉన్నారు. ఇక ఖానాపూర్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు గెలుపొందారు. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికల నాటి పరిస్థితుల మాదిరే ఇప్పుడు కూడా ఉంటాయా లేదా అనేది చూడాల్సిందే.

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మొదట బోథ్, ఆ తర్వాత క్రమంలో ముథోల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ఖానాపూర్, నిర్మల్, సిర్పూర్ వరుస స్థానాల్లో నిలిచాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. కొంత అటు, ఇటైనప్పటికీ దాదాపు అదే శ్రేణిలో నిలిచాయి. మొదట బోథ్, ఆతర్వాత ఆసిఫాబాద్, ముథోల్, ఖానాపూర్, ఆదిలాబాద్, సిర్పూర్, నిర్మల్ వరుస స్థానాల్లో నిలిచాయి.

అటు, ఇటైనా.. అదే శ్రేణిలో

ఇక అంగన్‌వాడీల రిటైర్మెంట్

- ప్రభుత్వం కసరత్తు
- వివరాలు సేకరించే పనిలో నిమగ్నం
- జిల్లాలో 65ఏళ్లు దాటినవారు 200 మంది
- ఉద్యోగ విరమణతో మరిన్ని ఖాళీలు



అంగన్‌వాడీలు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగ విరమణ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 65 ఏళ్లు పైబడిన వారి వివరాలను సేకరిస్తుంది. అయితే గత నెల 30న వారు ఉద్యోగ విరమణ చేస్తారని ఆ శాఖ నిర్ణయించినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని పొడిగించింది. ఈ నెల చివరి వరకు, వచ్చే నెలలోనైనా వీరి ఉద్యోగ విరమణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో చాలా మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రిటైర్మెంట్ కానున్నారు. వయస్సు పైబడడంతో వీరు విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందించలేక పోతున్న ట్లు తెలుస్తోంది. వయస్సు పైబడిన టీచర్లు, ఆ యాల కుటుంబీకులు కొన్నిచోట్ల విధులు నిర్వహిస్తుండగా, ఇంకొంత మంది వేరే వారితో ఆ పనులు చేయిస్తున్నారు. కొన్నేళ్లుగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియ జరగడం లేదు. దీంతో ఖాళీలతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. వీరు రిటైర్మెంట్ అయితే మరికొన్ని పోస్టులు ఖాళీ కానున్నాయి.

వివరాల సేకరణలో..

అంగన్‌వాడీల రిటైర్మెంట్ ప్రక్రియకు సంబంధించి ఆ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టుల పరిధిలో ఎంత మంది ఏ వయస్సు వారు ఉన్నారు.. పుట్టిన తేదీ తదితర వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే జిల్లాలో 65 ఏళ్ల పైబడిన అంగన్‌వాడీలు 30, ఆయాలు 146 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరితో పాటు పుట్టిన తేదీ లేని వారిని రిమ్స్ ఆస్పత్రికి వయస్సు నిర్ధారణ కోసం పంపనున్నారు. మొత్తం దాదాపు 200 మంది వరకు రిటైర్డ్‌మెంట్ అయ్యే అవకాశం ఉంది. గత ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును మూడేళ్లకు పెంచిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నుంచి రిటైర్ అవుతున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలను కూడా రిటైర్మెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

బెనిఫిట్స్‌పై అనాసక్తి..

రిటైర్మెంట్ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం నుంచి వచ్చే సాయం సరిగా లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నామమాత్రంగా ప్యాకేజీ ఇస్తుందని చెబుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.1లక్ష ఇవ్వాలన్న డిమాండ్ ఉండగా, టీచర్‌కు రూ.1లక్ష, ఆయాకు రూ.50వేల వరకు ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. రిటైర్మెంట్ అయిన తర్వాత ఆసరా పింఛన్ కూడా ఇవ్వాలని పేర్కొంటున్నారు. దీనిపై ఇంకా పూర్తిగా నిర్ధారణ రాకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారు.

పెరగనున్న ఖాళీలు..

జిల్లాలో ఐసీడీఎస్ ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,256 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 50 వేల మంది చిన్నారులు, 12 వేల మంది గర్భిణీ, బాలింతలు ఉన్నారు. వీరందరికి ప్రతిరోజు ఆరోగ్యలక్ష్మి ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇప్పటికే ఖాళీలతో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కొన్ని కేంద్రాల్లో టీచర్లు ఉంటే ఆయాలు లేరు.. మరికొన్ని కేంద్రాల్లో టీచర్లు లేకుండా ఆయాలే సెంటర్లు నడుపుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉద్యోగ విరమణ ప్రకటిస్తే జిల్లాలో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. అయితే వీరి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు మేలు చేకూరనుంది.

వివరాలు సేకరిస్తున్నాం..

65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. రిటైర్మెంట్‌కు సంబంధించి ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. కొంత మంది టీచర్ల పుట్టిన తేదీ సరిగా లేకపోవడంతో వారి వయస్సు నిర్ధారించేందుకు రిమ్స్ డైరెక్టర్‌కు లెటర్ రాసి చర్యలు చేపడతాం.

– సబిత, జిల్లా సంక్షేమ అధికారి, ఆదిలాబాద్

కాంగ్రెస్ శ్రేణుల నిరసన



ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ మాజీ నాయకులు సుజాత, సంజీవ్‌రెడ్డిలు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కుమ్మక్కై పార్టీకి ద్రోహం చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వారి వైఖరిని తప్పుబడుతూ పట్టణంలోని ప్రజాసేవభవన్ వద్ద ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే శంకర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి ఫొటోలతో కూడిన దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు సంతోష్‌రావు మాట్లాడుతూ.. సుజాత, సంజీవ్‌రెడ్డిలు గత అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీ నుంచి బయటకు వెళ్లి రెబెల్‌గా బరిలోకి దిగారని గుర్తు చేశారు. మరోసారి బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుని డబ్బులకు అమ్ముడుపోయి పార్లమెంట్ ఎన్నికల్లోనూ తీరని నష్టం చేశారని ఆరోపించారు. ఇదే విషయాన్ని కంది శ్రీనివాసరెడ్డి ప్రస్తావిస్తూ సుజాత తప్పిదాన్ని ఎత్తిచూపారే తప్ప మున్నూరు కాపులను ఎక్కడా దూషించలేదన్నారు. అన్ని కుల సంఘాలపై కంది గౌరవంగా ప్రవర్తిస్తారని, ఈ విషయాన్ని సంఘ సోదరులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, నాయకులు వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిప్రణయ్, వెంకన్న, పట్టణ అధ్యక్షుడు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



తడిసిన జొన్నల సంచులు



వర్షపు నీటికి కొట్టుకుపోతున్న జొన్నలు

గాలివాన బీభత్సం

సిరికొండ/ఇంద్రవెల్లి/బోథ్/నేరడిగొండ: జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సిరికొండ మండలంలోని ధర్మసాగర్ చౌరస్తా వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డుగా పడి పోయింది. చిమ్మన్‌గూడి నుంచి ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 వాహనం అరగంట పాటు నిలిచిపోయింది. అనంతరం గ్రామస్తులు వృక్షాన్ని పక్కకు తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి. బోథ్ మార్కెట్ యార్డుకు విక్రయించేందుకు తీసుకువచ్చిన జొన్నలు తడవకుండా రైతులు ఇబ్బందులు పడ్డారు. టర్పాలిన్లు కప్పినా జొన్నల సంచులు తడిసిపోయాయి. ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గామ్, భీంజితండాలో పలువురి ఇళ్ల పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. దీంతో ఇళ్లలో ఉన్న సామగ్రి తడిసిపోయాయి. నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో జొన్న, నువ్వు పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది.



డొంగర్‌గామ్‌లో ఊడిపోయిన రేకులను సరిచేస్తున్న గిరిజనుడు

ఆకర్షించని.. ఆదర్శం!

- లక్షలు వెచ్చించినా పెరగని పోలింగ్‌శాతం
- సౌకర్యాలు కల్పించినా ముందుకు రాని ఓటర్లు
- జిల్లాలోని మోడల్ పోలింగ్ కేంద్రాల పరిస్థితి



మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కోలాం ఆశ్రమ పాఠశాల (ఫైల్)

కైలాస్‌నగర్: ఈ నెల 13న నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించడంతో పాటు వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మహిళలు, యువకులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రాలతో పాటు పది సాధారణ మోడల్ కేంద్రాలను అందుబాటులో ఉంచింది. ఒక్కో కేంద్రానికి రూ.40వేల వరకు వెచ్చించి సుందరంగా ముస్తాబు చేశారు. ఆయా కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ఆకర్షించడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా కుర్చీలు, షామియానాలు, తాగునీరు వంటి వసతులతో పాటు ఇద్దరు సహాయకులను నియమించారు. ఇలా లక్షలాది రూపాయలు వెచ్చించి జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంత చేసినా ఆ కేంద్రాలు మాత్రం ఆదర్శంగా నిలువలేదు. ఒక్క కేంద్రంలో కూడా 90శాతం పోలింగ్ నమోదు కాకపోవడం గమనార్హం.

ఏడు కేంద్రాల్లో మాత్రమే 80శాతం

ఆదిలాబాద్ నియోజకవర్గంలో 12, బోథ్ నియోజకవర్గంలో 12 చొప్పున జిల్లాలో 24 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కేవలం 7 పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే 80కిపైగా పోలింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 87.90శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా ఆదిలాబాద్ పట్టణం టీచర్స్ కాలనీలోని ఎస్‌ఆర్ డీజీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో 48.51శాతం నమోదైంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఇతర పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పించనప్పటికీ ఇంతకంటే ఎక్కువగానే పోలింగ్ శాతం నమోదవడం గమనార్హం. అలాంటప్పుడు లక్షలు వెచ్చించి మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో ఉపయోగమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు ఓటర్ల సంఖ్యకనుగుణంగా పోలింగ్ శాతం మెరుగుపర్చడం కంటే తమకు లాభసాటిగా, కలిసొచ్చే కేంద్రాలనే మోడల్‌గా ఏర్పాటు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే ఆయా కేంద్రాల్లో పోలింగ్ శాతం ఇలా నమోదైందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకైనా వ్యయంపై ఐసీడీఎస్ అధికారి మిల్కాను 'సాక్షి' సంప్రదించగా వివరాలు తమ వద్ద లేవని దాటవేసే యత్నం చేశారు. ఒక్కో కేంద్రానికి ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించగా అలా చెప్పలేమని పేర్కొనడం గమనార్హం.

జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ కేంద్రాల్లో నమోదైన పోలింగ్ వివరాలు..

ఆదర్శ కేంద్రాలు..	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
ప్రభుత్వ బాలక్‌మందిర్,ఆదిలాబాద్	1,137	780	68.60
ప్రభుత్వ డైట్ కళాశాల, ఆదిలాబాద్	1,237	1,798	64.51
జెడ్పీఎస్‌ఎస్, యాపల్‌గూడ	936	819	87.50
జెడ్పీఎస్‌ఎస్, అంకోలి	656	544	82.93
జెడ్పీఎస్‌ఎస్, సరస్వతినగర్	806	484	60.50
ఎంపీపీఎస్, సుంకిడి, సిరికొండ	1,018	894	76.15
ఎంపీపీఎస్, కుమారి, నేరడిగొండ	662	536	80.97
జెడ్పీఎస్‌ఎస్ తోషం, గుడిహత్నూర్	697	556	79.77
గిరిజన సంక్షేమపాఠశాల,లక్ష్మీపూర్	709	578	81.52
ఎంపీపీఎస్,అడెగామ, ఇచ్చోడ	1,353	1,025	75.76
మహిళా కేంద్రాలు			
కోలాం ఆశ్రమ పాఠశాల, ఆదిలాబాద్	1,085	687	63.32
ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల	629	452	71.86
షాదీఖానా, పుత్లీబౌలి	1394	927	66.50
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిర్పెల్లి	1,118	796	71.20
ఉర్దూ ప్రాథమిక పాఠశాల, హమీద్‌పుర	1,097	662	60.35
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోథ్	857	647	75.50
మండల ప్రాథమిక పాఠశాల, ముఖరా(కే)	439	378	86.10
జెడ్పీఎస్‌ఎస్ తేజాపూర్, నేరడిగొండ	734	599	81.06
జెడ్పీఎస్‌ఎస్ మన్నూర్, గుడిహత్నూర్	604	459	75.99
జెడ్పీఎస్‌ఎస్, ఇచ్చోడ	660	385	58.33
యూత్ కేంద్రాలు			
ప్రభుత్వ బాలికల జూనియర్‌కళాశాల,ఆదిలాబాద్	527	341	64.71
గిరిజన సంక్షేమ పాఠశాల సాత్‌నంబర్‌గాంవ్, ఇచ్చోడ	895	737	82.35
దివ్యాంగుల కేంద్రాలు			
ఎస్‌ఆర్ డీజీ స్కూల్, టీచర్స్ కాలనీ,ఆదిలాబాద్	738	358	48.51
ఎంపీపీఎస్, తలమడుగు	1,174	894	76.15

ఆ కేంద్రాల్లోనూ అంతంతే పోలింగ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సరళిపై సమీక్షిస్తున్న నాయకులు బూత్‌ల వారీగా నమోదైన ఓట్ల వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు ఓటు వేసిన కేంద్రాల్లో పోలింగ్ శాతం అంతంతగానే నమోదైనట్లు తెలుస్తోంది.

- బీజేపీకి చెందిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ పట్టణంలోని శాంతినగర్‌లో గల 281వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో మొత్తం 1,350 ఓట్లు ఉండగా కేవలం 843 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడ 62.44 పోలింగ్ శాతం నమోదైంది.
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న తన స్వగ్రామమైన జైనథ్ మండలం దీపాయిగూడలో గల 27వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 796 ఓట్లుండగా 592 ఓట్లు పోలయ్యాయి. 74.37శాతం పోలింగ్ నమోదైంది.
- కాంగ్రెస్‌కు చెందిన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పట్టణంలోని కోలాం ఆశ్రమ పాఠశాలలో గల 177వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కేంద్రంలో 1,085 ఓట్లుండగా 687 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ కేంద్రంలో 63.32శాతం పోలింగ్ నమోదైంది.

కాగా ఇక్కడ పోలైన ఓట్లలో ఏ పార్టీ అధిక్యత సాధిస్తుందనేది జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో వెల్లడి కానుంది.

క్లుప్తంగా

రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత


టిప్పర్లతో మైనింగ్ శాఖ టీఏ

బేల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కాంఘర్పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తున్న క్రమంలో ఈ రెండు టిప్పర్లు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. దీనిపై జిల్లా మైనింగ్ శాఖ ఏడీకి నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద గంగయ్య

ఇచ్చోడ: మండలంలోని గేర్జం గ్రామంలో గంగయ్య అనే రైతుకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. రెండు రోజుల క్రితం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పంటపొలాల్లో త్రీఫేజ్ విద్యుత్ తీగలు తెగిపోయాయి. మేతకు వెళ్లిన ఆవు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేల వరకు ఉంటుందని, పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో 9 మేకలు మృతి


మృతి చెందిన మేకలు

నేరడిగొండ: మండలంలోని లక్ష్మీపూర్‌లో ఆడేం అర్జున్‌కు చెందిన తొమ్మిది మేకలు విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతిచెందాయి. మొత్తం 80 మేకలను మేత కోసం అడవికి తీసుకెళ్లే క్రమంలో గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో వాటికి తగిలి సంఘటన స్థలంలోనే మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మేకలు మృతి చెందాయని రైతు వాపోయాడు. మేకల విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

‘కడెం’ మరమ్మతులు పూర్తయ్యేనా?

- సమీపిస్తున్న వానాకాలం
- ఇప్పటికీ పూర్తికాని పనులు
- అయోమయంలో ఆయకట్టు రైతాంగం


కడెం ప్రాజెక్ట్

కడెం: రెండేళ్లుగా వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో వరద గేట్లు పనిచేయకపోవడంతో ప్రాజెక్టు డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. 2022లో భారీగా వరదనీరు వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023లో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదనీటితో ప్రాజెక్ట్ అతలాకుతలం అయ్యింది. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిధులు కేటాయించడంతో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వానాకాలం సమీపిస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. సీజన్ ప్రారంభం నాటికి పనులు పూర్తి అవుతాయో లేదోనని ఆయకట్టు రైతాంగం అయోమయంలో ఉంది. ప్రాజెక్ట్ మరమ్మతు పనులను పరిశీలించేందుకు బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌తో పాటు అధికారుల బృందం ప్రాజెక్టును సందర్శించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వారి పర్యటన వాయిదా పడింది.

పనులు పూర్తయ్యేనా..

రెండేళ్లుగా వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.46 కోట్ల నిధులు విడుదల చేయడంతో పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 9 ఇండియన్ గేట్లలో ఏడు గేట్లకు రూలర్స్ అమర్చారు. మరో రెండు గేట్లకు అమర్చాల్సి ఉంది. 11 వరద గేట్లకు రబ్బర్ సీల్స్ అమర్చారు. 9 జర్మనీ గేట్లలో 7 గేట్లకు గేర్ బాక్స్‌లు అమర్చారు. మరో రెండింటికి అమర్చాలి. రెండు వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు, వైర్ రోప్స్ అమర్చాలి. 9 జర్మనీ గేట్లకుగానూ 7 గేట్లకు బ్రేక్ లైనర్స్ అమర్చారు. మరో రెండు గేట్లకు అమర్చాలి. నాలుగు వరద గేట్లకు కొత్త మోటార్లు బిగించాల్సి ఉంది. ప్రాజెక్ట్ ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం ఇటీవలే నిధులు విడుదలయ్యాయి. టెండర్ పూర్తి కాక పనులు ప్రారంభం కాలేదు. దీంతో వైరింగ్, ప్యానెల్ బోర్డ్స్, స్టార్టర్స్, తదితర ఎలక్ట్రికల్ పనులు పూర్తి కాలేదు. సివిల్ వర్క్‌లో భాగంగా స్పిల్‌వే పనులు కొనసాగుతుండగా అఫ్రాన్, వాల్స్ పనులు పూర్తయ్యాయి.


కొనసాగుతున్న వరద గేట్ల మరమ్మతులు

ఆయకట్టుకు సాగునీరివ్వాలి



కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి. ప్రాజెక్ట్ మరమ్మతులు చేపట్టకపోవడంతోనే ఈ ఏడాది యాసంగికి సాగు నీరివ్వలేదు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ పూర్తిస్థాయి మరమ్మతులు సకాలంలో పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి.
– రాజేశ్, రైతు, దస్తురాబాద్

జూన్ 15లోగా పూర్తి



కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల పనులు కొనసాగుతున్నాయి. రోలర్స్, రబ్బర్ సీల్స్, తదితర పనులు పూర్తయ్యాయి. రెండు వరద గేట్లకు కౌంటర్ వెయిట్‌లు బిగించాలి. ఎలక్ట్రికల్ టెండర్ ప్రక్రియ పూర్తి కానందువల్ల పనులు చేపట్టలేదు. జూన్ 15 లోగా మరమ్మతు పనులు పూర్తి చేస్తాం.
– భోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

ఆలయాలే టార్గెట్..!


జామ్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో విచారణ చేపడుతున్న పోలీసులు

- పది రోజుల వ్యవధిలో రెండు దేవాలయాల్లో చోరీ
- తాజాగా జామ్ మహాలక్ష్మీ ఆలయంలో..
- భయాందోళనలో ప్రజలు

సారంగాపూర్: ఆలయాలనే టార్గెట్‌గా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పది రోజుల వ్యవధిలో మండలంలోని రెండు దేవాలయాల్లో చోరీకి పాల్పడిన గుర్తు తెలియని దుండగులు బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఇటీవల మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ జరగగా తాజాగా మంగళవారం రాత్రి జామ్ గ్రామ సమీపంలోని మహాలక్ష్మీ దేవాలయంలో దొంగలు పడ్డారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి అమ్మవారి రెండు గ్రాముల బంగారు ముక్కుపుడుకలు, పుస్తెలతో పాటు హుండీని ధ్వంసంచేసి అందులోని నగదును అపహరించారు. బుధవారం తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన భక్తులు చోరీ జరిగిన విషయం గమనించి గ్రామస్తుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆలయ పరిసరాల్లో గాలించగా కొంతదూరంలో హుండీ ధ్వంసం చేసి ఉంది. మరో డబ్బాలో దాచిన వెండికళ్లు, ఇతర సామగ్రి అలాగే వదిలేసినట్లు గుర్తించారు. అమ్మవారి విగ్రహానికి అంటించి ఉన్న వెండి కళ్లు కూడా అలాగే వదిలేసి కేవలం బంగారం, నగదును మాత్రమే అపహరించారు.

రెండు ఆలయాల్లోనూ అదే తీరు..

ఇటీవల సారంగపూర్ మండలం ఆలూరు గ్రామ సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగలు దేవాలయంలోని హుండీని పగులగొట్టి అందులోంచి నగదును అపహరించారు. అలాగే అమ్మవారికి అలంకరించిన మూడు జతల బంగారు పుస్తెలు (రెండు గ్రాములు), బంగారు బొట్టుబిళ్ల, రెండు గ్రాముల వెండి మెట్టెలు దొంగిలించారు. తాజాగా జరిగిన జామ్ మహాలక్ష్మీ దేవాలయంలోనూ ఇదేరీతిలో చోరీ జరిగింది.

చిన్న ఆలయాలే టార్గెట్

గ్రామాలకు దూరంగా ఉన్న చిన్న చిన్న ఆలయాలనే దొంగలు టార్గెట్‌గా ఎంచుకున్నట్లు ఈ రెండు ఘటనల ద్వారా తెలుస్తోంది. చీకటి పడితే ఆలయాలకు తాళం వేసి పూజారులు ఇళ్లకు వెళ్లిపోతారు. ఆలయ సమీపంలో జనసంచారం ఉండదు. కనుక ఇలాంటి ఆలయాలనే దొంగలు ఎంచుకుని వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

మండలంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీ అయిన జామ్ గ్రామంలో రెండు వీడీసీలున్నాయి. వీటి ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం దాదాపు 15 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో అవికాస్తా మూలనపడి అలంకారప్రాయంగా మారాయి. ఒకవేళ సీసీకెమెరాలు పనిచేసి ఉంటే దొంగలు పట్టుబడేవారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏదేమైనా పది రోజుల వ్యవధిలోనే రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆలయాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం

గ్రామాలకు దూరంగా ఉన్న చిన్న ఆలయాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పెద్దమ్మ తల్లి ఆలయంలోనూ ఇదేవిధంగా చోరీ జరిగింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం. గ్రామస్తులు సైతం ఆలయాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశాం.
– చంద్రమోహన్, ఎస్సై, సారంగపూర్

గురుకులాన్ని సందర్శించిన కేంద్ర బృందం


పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలను బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల బృందం పరిశీలించింది. కొంతకాలంగా కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ నీటి పొదుపుపై పలు పాఠశాలలు, కళాశాలలకు అవార్డులు అందజేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో రెండు గురుకుల పాఠశాలలు ప్రావిజనల్ జాబితాలో ఉండగా అందులో బోథ్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఒకటి. ఈ క్రమంలో పాఠశాలలో నీటి పొదుపు అంశంపై పరిశీలించారు. నీటి సంరక్షణ నీటి పొదుపు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. నీటి పునర్వినియోగం పద్ధతులు, నిర్మాణాలను పరిశీలించారు. వారి వెంట పరిశీలనా బృందం శాస్త్రవేత్త ఉపేందర్, ఇంజనీర్ కృతిక, బోథ్ ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావ్, ఏపీడీ కృష్ణారావు, సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు సంతోష్, అమాన్, శ్రీనివాస్ ఉన్నారు.

హత్యాయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదు


పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తనపై కొంతమంది హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బీజేపీ యువ మోర్చా నాయకుడు గటిక క్రాంతికుమార్ బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు తమ ఇంటికి వచ్చి బెదిరింపులకు పాల్పడడమే కాకుండా హత్యాయత్నం చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు తనను టార్గెట్ చేస్తున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందన్నారు. వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. తనపై హత్యాయత్నానికి ఉసిగొల్పిన కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు మద్దతుగా పలువురు బీజేపీ నాయకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

గ్రామస్తుల చేతిలో కొండ చిలువ హతం


పంటచేను వద్ద కొండచిలువ

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం గ్రామస్తులు కొండ చిలువను హతమార్చిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మోహన్‌పాటిల్ పంటచేనులో 12 అడుగుల కొండ చిలువ కనిపించడంతో అటుగా వెళ్తున్న కొందరు రైతులు దానిని హతమార్చారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య


పొచ్చన్న (ఫైల్)

తాంసి: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గుగ్గిల పొచ్చన్న (58) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించేందుకు డబ్బులు లేకపోవడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఊరిబయట ఉన్న వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎస్సై ప్రదీప్‌కుమార్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య రమణాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్‌పై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ గోపాల్ బుధవారం దుర్గనగర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై పిట్టల్‌వాడకు వస్తుండగా 170 కాలనీకి చెందిన అజయ్ మహకాల్‌తో పాటు పలువురు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అజయ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదు’

ఎదులాపురం: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, పేషెంట్ కేర్‌లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి బుధవారం రిమ్స్‌లోని యూనియన్ భవనంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గణపతి లక్ష్మిని మానసికంగా ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగించి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డొంగ్రే చందు, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు సంగీత, యూనియన్ నాయకులు సంతోశ్, రాజేందర్ సింగ్, సైఫ్‌ఖాన్, రాథోడ్ రవీందర్, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేషెంట్‌కేర్ ఆత్మహత్యాయత్నం

- సూపర్‌వైజర్ వేధింపులే కారణం
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు


బాధితురాలి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పేషెంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి అనే మహిళా కార్మికురాలు బుధవారం తెల్లవారుజామున గైనిక్‌వార్డులో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన సిబ్బంది వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆస్పత్రి అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కాగా రిమ్స్‌లో మహిళా ఉద్యోగులపై వేధింపులు పరిపాటిగా మారాయి. నెల రోజుల క్రితం ఓ స్టాఫ్‌నర్సును పేషెంట్ కేర్‌గా పనిచేసే పురుష ఉద్యోగి వేధించిన విషయం తెలిసిందే.

అసలేం జరిగిందంటే ...

ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్‌కు చెందిన లక్ష్మి 16 ఏళ్లుగా రిమ్స్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా, రెండేళ్లుగా పేషెంట్‌కేర్‌గా పనిచేస్తోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి గైనిక్‌వార్డులో విధుల నిర్వహణకు హాజరైంది. పది గంటల సమయంలో ఛీఫ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విధుల నుంచి వెళ్లిపోవాలని, రేపటి నుంచి డ్యూటీకి రావాల్సిన అవసరం లేదని బెదిరింపులకు పాల్పడ్డట్లు బాధితురాలు వాపోయింది. మరో సూపర్‌వైజర్ గైనిక్‌వార్డులో పనిచేసే దాయమ్మ అనే మహిళ కూడా కొన్ని రోజులుగా మానసిక వేధింపులకు పాల్పడుతుందని కన్నీరుమున్నీరైంది. తనకు ముగ్గురు పిల్లలున్నారని, అకారణంగా ఉద్యోగం నుంచి తీసివేస్తే తమ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. అర్ధరాత్రి వేళ తాను ఇంటికి ఏ విధంగా వెళ్లాలని తన కుటుంబ సభ్యులు ఏమనుకుంటారనోనని వేదనకు గురై మరుగుదొడ్డిలో ఉన్న ఫినాయిలు తాగింది. నోటి నుంచి నురగ రావడంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అక్కడి నుంచి తరలించారు.

విచారణ కమిటీ నియామకం

రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందించి సూపర్‌వైజర్ రవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లుగా వెల్లడించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: రిమ్స్‌లో పేషెంట్ కేర్‌గా పనిచేస్తున్న గణపతి లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు నవీన్ కుమార్, అగ్గిమల్ల స్వామి, రిమ్స్ నాయకులు పెర్క దేవిదాస్, అక్రమ్ ఖాన్, సుభాష్, దశాంత్ రమేశ్, శేఖర్, ఖలీల్, సుమన్ తాయి, రాణి, అనసూయ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

అండగా దోస్త్.. కోర్సులు మస్త్

- కొనసాగుతున్న తొలివిడత ప్రవేశాల ప్రక్రియ
- ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, 30కి పైగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు

నిర్మల్‌ఖిల్లా: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ ఆఫ్ తెలంగాణ) ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, తదితర కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్నీ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సందేహాల నివృత్తికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని, తప్పుగా నమోదు చేసినట్లు నిర్ధారించుకుంటే హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని కోరుతున్నారు.

సంప్రదాయ కోర్సులకు డిమాండ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, దాదాపు 30 వరకు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులోని అన్ని రకాల కోర్సుల్లో కలిపి దాదాపు 18 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. డిగ్రీలో సంప్రదాయ కోర్సులకు ఆదరణ ఎక్కువగా ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్తరకం ఉపాధి కోర్సులను కూడా ప్రారంభిస్తోంది.

ప్రవేశాలు మూడు దశల్లో...

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు మూడు విడతల్లో జరగనున్నాయి. మే 6 నుంచి మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 20 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 7 నుండి 12 వరకు కేటాయించబడిన కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల ప్రకారం రెండవ దశ, మూడవ దశ లో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

రెండో దశ..

రూ.400 రుసుంతో జూన్ 6 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 6 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు.

మూడో దశ..

జూన్ 19 నుంచి 25 వరకు ‘దోస్త్’ మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మొబైల్ యాప్ ద్వారా కూడా దరఖాస్తు..

మొబైల్ యాప్ ద్వారా కూడా దోస్త్ దరఖాస్తు చేసుకోవచ్చని హెల్ప్ డెస్క్ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ ఫోన్లలోని ప్లే స్టోర్ నుంచి డిగ్రీ దోస్త్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సూచించిన ప్రకారం మొబైల్ నంబర్ ఓటీపీతో వెబ్‌సైట్లోకి ప్రవేశించి సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వెబ్ ఆప్షన్ల తర్వాత ఏ కాలేజీలో సీట్ అలాట్ అయిందో కూడా తెలుసుకోవచ్చు. వెబ్ ఆప్షన్స్ నమోదు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సమీపంగా ఉన్న వాటిని ముందుగా ఎంచుకుని ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో దూరంగా ఉన్న వాటిని పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కోర్సులు కూడా తమకు నచ్చిన వాటిని తొలుత, ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలని కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఎన్నో కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వృత్తి విద్యా కోర్సులతో పాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులకు సైతం డిమాండ్ ఉంది. కిందిస్థాయి ఉద్యోగాల నుంచి సివిల్స్ వరకు జరిగే పోటీ పరీక్షలలో డిగ్రీ సిలబస్ నుంచే ప్రశ్నలు వస్తున్నాయి. డిగ్రీ కనీస అర్హతగా కొనసాగుతోంది కాబట్టి విద్యార్థులు కోర్సును ఎంచుకునే ముందు ఆలోచించి తమకు అనుగుణంగా ఉన్న కోర్సును ఎంపిక చేసుకోవాలి. పట్టుదలతో నిరంతరం శ్రమించి డిగ్రీ విద్యతో పాటు తగిన నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌లో మంచి రంగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.
– డా.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, దోస్త్ జిల్లా సమన్వయకర్త, నిర్మల్